# నిస్సీ జయధ్వజము

విడి ప్రతిక రూ 8/-

జనవరి - 2016 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-


# సంరక్షకుడు

జెకర్యాగ్రంధాన్ని ధ్యానించినప్పుడు ప్రభువు రాకడ దినాలలో జరిగే సంభవాల గురించి ప్రభువు తన ప్రవక్త ద్వారా వ్రాసి ఉంచారు. కడవరి దినాలలో జరిగే సంఘటనలను ప్రస్తావిస్తూ 12వ అధ్యాయంలో ఈ మాటలు వ్రాస్తున్నాడు.

**"ఆకాలమున యెహోవా యెరూషలేం నివాసులకు సంరక్షకుడుగా నుండును. ఆ కాలమున వారిలో శక్తిహీనులు దావీదువంటివారుగాను, దావీదు సంతతివారు దేవుని వంటివారుగాను జనుల దృష్టికి యెహోవా దూతలవంటి వారుగాను ఉందురు.జెకర్యా 12:8"**

ఇశ్రాయేలు ప్రజలు ఒకప్పుడు శక్తిహీనులు ఈ రోజు శక్తివంతులుగా ఈ భూమి మీద నివసిస్తున్నారు. ఇశ్రాయేలు ప్రజలకు యెహోవాయే సంరక్షకుడుగా ఉన్నాడు. అనగా పోషించేవానిగా, కాపాడేవానిగా, ఆదరించే వానిగా కన్నతండ్రివలె చేయి పట్టుకొని నడిపిస్తున్నాడు. ఈ రోజు ఇశ్రాయేలీయులకు ఏమి ఆధారం? యెహోవాయే వారికి ఆధారం. చుట్టూ శత్రుదేశాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రపంచపటంలో ఆవగింజ అంత ఉన్న ఇశ్రాయేలు దేశాన్ని దేవుడు తన కంటికి రెప్పవలె కాపాడుతూ వారికి సంరక్షకుడై వారిని పోషిస్తున్నాడు. వారు శక్తిహీనులైనప్పటికిని చరిత్రనుతిరిగివేస్తే ఇశ్రాయేలు దేశం మీద జరిగినన్ని యుద్ధాలు ఇంతవరకు ఏదేశం మీద జరుగలేదని చరిత్ర తెలుపుతుంది. ఇశ్రాయేలు దేశం ప్రపంచపటంలో కన్పించకుండా చేయాలని యుద్దాలుచేసారు. కాని యుద్ధాలు చేసిన శత్రుసామ్రాజ్యాలైన మహారాజులైన చక్రవర్తులైన కనుమరుగైపోయారు.ఇశ్రాయేలుదేశం స్థిరంగా భద్రంగా ఉన్నది.

కీర్తనకారుడు అంటున్నాడు దేవుడు ఆ పట్టణంలో ఉన్నాడు గనుక ఆపట్టణానికి చలనం లేదు. దేవుడు ఏ పట్టణంలో ఏస్థలంలో ఏ గృహంలో ఉంటాడో అక్కడ చలనం ఉండదు. బైబిల్ చెప్తున్న విషయమేమిటంటే చివరికి ఇశ్రాయేలు దేశమే ప్రపంచానికి బండగా బరువుగా

మారుతుంది. **"నేను యెరూషలేమును సమస్తమైన జనులకు బరువైన రాయిగా చేతును, దానిని ఎత్తి మోయువారందరు మిక్కిలి గాయపడుదురు. భూజనులందరు దానికి విరోధులై కూడుదురు. జెకర్యా 12:2"**కడవరి కాలమందు ఇశ్రాయేలుదేశం ప్రపంచానికి ఒక బండగా మారుతుంది. కారణం యుదుల ఆచారాలు పద్ధతులు వారి ఆరాధ్యదైవం వేరు ప్రపంచదేశాలన్నిటికి రకరకాలైన దేవతలు దేవుళ్ళు ఉన్నారు. కాని యూదులకు ఒకేదేవుడు ఒకే క్రమం ఒకే పద్ధతి ఒకే ఆరాధనా ఒకే బాష ఒకే దైవక్రమంలో ఎదుగుతున్న దైవజనాంగానికి దేవుడు తోడుగా ఉంటాడు. ప్రపంచం అంతా యూదా దేశాన్ని ముట్టడివేస్తారు. దేవుడే ఆపట్టణంలో ఉన్నాడు గనుక దేవుడు వారిని రక్షస్తాడు. "శక్తిహీనులు దావీదువంటివారుగాను, దావీదు సంతతివారు దేవుని వంటివారుగాను జనుల దృష్టికి యెహోవా దూతలవంటి వారుగాను ఉందురు. అటువంటి బలవంతులుగా శక్తిమంతులుగా ఈరోజు వారిని మార్చుకున్నాడు. వారు ప్రపంచానికి దేవదూతలవలె ఉన్నారు. మేము ఇశ్రాయేలుదేశానికి వెళ్లినప్పుడు అక్కడి యూదులను చూసి దేవున్ని చూసినంత ఆనందపడ్డాం. పట్టణం చూసినప్పుడు పరలోకం చూసినంత సంతోషించాము. కారణం వారు దేవుని ప్రజలు నిబంధన జనులు. ధర్మశాస్త్రం వారిది ఆజ్ఞలు వారివి, వాగ్దానాలు వారివే ప్రవచనాలు వారివే వారిని చూస్తే ఎంతో ఆనందించాము.

ప్రియమైన దైవజనాంగమా, యెరూషలేం పట్టణమనగా ఏమిటి? యెరూషలేము పట్టణం దేవుని సంఘానికి సూచనగా ఉన్నది. ప్రభువు- నేను యెరూషలేము పట్టణములోనున్న ప్రజలకు సంరక్షకుడుగా ఉన్నాను అని ప్రభువు సెలవిస్తున్నాడు. నేడు యేసురక్తంలో కడుగబడి ఆయన ఆజ్ఞలమార్గంలో నడుస్తున్న క్రొత్తనిబంధన సంఘానికి, విశ్వాసికి దేవుడు సంరక్షకునిగా, తండ్రిగా, పోషించేవానిగా, ఆదరించేవానిగా ఉంటానని ప్రభువు సెలవిస్తున్నాడు.చాలాసార్లు మనకుటుంబ విషయాల్లో బాధపడ్తుంటాం, అయ్యో నాపిల్లల పరిస్థితి ఏమిటి? నా ఉద్యోగం పరిస్థితి ఏమిటి? నా రాబడి ఎంత, ఇవి ఖర్చులకు సరిపోతాయా? కడుపార భోజనం చేయలేకపోతున్నానే రేపటి పరిస్థితి ఏమిటి? ఈ విషయాలు జ్ఞాపకం వచ్చినప్పుడు తల్లిదండ్రులు కృంగిపోతారు. ఈ పత్రిక చదువుతున్న నీతో "నేను నా ప్రజలైన ఇశ్రాయేలు ప్రజలను పోషించినరీతిగా సంరక్షించినరీతిగా నేను నీకు సంరక్షకునిగా ఉంటానని ఈ నూతన సంవత్సరములో ప్రభువు వాగ్దానం చేస్తున్నాడు. ప్రపంచమంతా పట్టణమంతా కరువుతో ఉన్నా, నీ గృహంలో కరువు ఉండనియ్యను. వర్షాలుపడలేదని, పంటలు పండలేదని, మంచి జీతం రావడంలేదని అయ్యో రేపటిపోషణ ఎలా? నా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? అని నీవు కలవరపడకు. యేసయ్యే నీ కుటుంబానికి సంరక్షకునిగా ఉంటాడు. ఒకవేళ నీవు నీ సొంతశక్తితో సొంత జ్ఞానంతో కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషించుకోవాలని నీ స్వశక్తి మీదనే ఆధారపడితే నీవు వర్ధిల్లలేవు. నిన్ను పోషించేది నీ ఉద్యోగం కాదు రాబడి, బంధువులు, స్నేహితులు కాదు నేనే నిన్ను పోషిస్తానని నీ కుటుంబాన్ని సంరక్షిస్తానని ప్రభువు అంటున్నాడు.

మన పితరులు40సంవత్సరాలు అరణ్యంలో ప్రయాణం చేసారు. ఎక్కడ విత్తనం వేసారు?

ఎక్కడ నీరుకట్టి పంటకోసారు? 40సం॥లు విత్తనం వేయక పంటకోయక ప్రయాణం చేస్తూనే ఉన్నారు వారి ప్రయాణమంతటిలో దేవుడే తోడుగాఉండి ప్రతిరోజు ఉదయం దేవదూతలుతినే శ్రేష్టమైన మన్నాను కురిపించాడు. ఒకరోజుకాదు నలువది సంవత్సరములు దేవుడు వారిని పోషించాడు.

**"ఆహారమునకై ఆయన వారిమీద మన్నాను కురిపించెను ఆకాశధాన్యము వారికనుగ్రహించెను. దేవదూతల ఆహారము నరులు భుజించిరి. భోజన పదార్థములను ఆయన వారికి సమృద్ధిగా పంపెను. కీర్తన 78:24"**

వారు భుజించినది మనుష్యులు తినే ఆహారము కాదు దేవదూతలు తినే ఆహారమును భూమిమీద ఉన్న ఇశ్రాయేలు ప్రజలు భుజించారు. మన్నా భుజించినందువల్ల వారి కాల్లు వాయలేదు, వారి బట్టలు చినగలేదు. తండ్రినివిడిచి తప్పిపోయిన కుమారుడు పందుల పొట్టుతిన్నాడు. తండ్రిని విడువక ఆయన సన్నిధిలోవున్న నిన్ను నన్ను చిరకాలం మన్నాతో పోషించునుగాకా! నిన్ను పోషించేబాధ్యత ప్రభువుది గనుక కలవరపడకు ధైర్యంగా ఉండు. పంటలు పండినా పండకపోయినా, జీతం వచ్చిన రాకపోయిన నిన్ను పోషిస్తాడు సింహపు పిల్లలు లేమిగలవై ఆకలితో ఉన్నను దేవుడు తన పిల్లలను కొదువలేకుండా పోషిస్తాడు.

పోషణ రెండురకాలుగా ఉన్నది. మొదటిది శరీరసంబంధమైన పోషణ రెండవది ఆత్మసం బంధమైన పోషణ. శరీరానికి శరీరసంబంధమైన ఆహారం అవసరం అలాగే ఆత్మకు ఆహారం జీవముగల దేవుని వాక్యం. ప్రతిరోజు శరీరానికి మూడుపూటల భోజనం అవసరము. ఏమి తింటే ఆరోగ్యంగా ఉంటుంది? అని నీ శరీరాన్ని గురించి చాలా ఆసక్తి కలిగిఉన్నావు. అలాగే నీ ఆత్మకు బలమును ఇచ్చే శ్రేష్టమైన ఉపదేశాన్ని దేవుని వాక్యాన్ని ప్రతిరోజు భుజించి నీ ఆత్మను శక్తివంతమైన ఆత్మగా మార్చుకోవాలి. నీ శరీరానికి కావలసిన ఆహారమే కాదు ఆత్మకుకూడ కావలసిన ఆహారాన్ని ఇచ్చి నిన్ను ప్రభువు పోషించి సంరక్షిస్తాడు. ప్రతి ఆరాధనలో, కూడికలలో ఒక వాక్యాన్ని, ఉపదేశాన్ని, వర్తమానాన్ని వింటున్నావు. వాక్యమనే ఆహారమును భుజించినప్పుడు నీ ఆత్మకు బలము కలుగుతుంది. శక్తిమంతునిగా నీవు మారి మంచి ఆరోగ్యంతో ఉంటావు. ఇక నీకు షుగర్, బీపి, హార్ట్ఎటాక్, క్యాన్సర్ మొదలైన రోగాలు ఏవి నీ దరిదాపుల్లోకి రాలేవు. ఎందుకు **"ఆదియందు వాక్యముండెను వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడైయుండెను."** ఆ వాక్యమే నీలో నివసిస్తుంది. గనుక నీకు ఏరోగం సమీపించదు. మరణం మనల్ని ఏమి చేయలేదు. ప్రభువురాకడలో రూపాంతరం చెందే మహిమగలిగిన దేహమును నీవు సంపాదించుకుంటావు. ప్రియమైన దైవజనాంగమా, దేవుడు మనకు సంరక్షకుడుగా ఉన్నాడు.

**"ఆ కాలమున వారిలో శక్తిహీనులు దావీదువంటివారుగాను," జెకర్యా 12:8**

ప్రభువు శక్తిహీనులుగా ఉన్న తన ప్రజలను గురించి మాట్లాడుతూ దావీదువలె శక్తిమంతునిగా మారుస్తానని అంటున్నాడు.

దావీదు ఎవరు? దావీదును గూర్చి ప్రభువు ఏమి చెప్తున్నాడు? దావీదు శక్తిగలవాడు.

దావీదు ఒకరోజు తన తండ్రిమందను కాస్తూఉండగా సింహము మందలోనికి వచ్చి గొఱ్ఱెపిల్లను నోట కర్చుకొని అరణ్యంలో పరుగెత్తుతుంది. అది చూసిన దావీదు గొఱ్ఱెను రక్షించడానికి సింహం వెంట పరుగెత్తుతున్నాడు. సాధారణంగా సింహాన్ని చూడగానే ఒక గొఱెపిల్ల పోతే పోయింది మిగతా గొఱ్ఱెలు బాగున్నాయికదా! సింహము క్రూరమైన జంతువు దానితో ఎందుకు పోటి? నేను మనిషిని అది నన్ను చంపేస్తుందని గొఱ్ఱెల కాపరులు అనుకుంటారు. కాని దావీదు అలా అనుకోలేదు. గొఱ్ఱెపిల్లను నోట కరచుకొని సింహము పరుగెత్తుతూఉంటే, ఆ సింహము వెంట దావీదు పరుగెత్తుతున్నాడు. ప్రపంచంలోనే సింహము వెంట పరుగెత్తిన వ్యక్తి ఎవరైన ఉన్నారా? సింహంరాగానే చెట్టునెక్కేవారిని, పరుగెత్తేవారిని లేదా సింహం వస్తే మేకనైనా, గొఱ్ఱెనైనా వదిలిపెట్టి తమ ప్రాణాలను కాపాడుకునేవారిని చూసాము. బాలుడు లేతవయస్సు గల దావీదు సింహాన్ని తరుముతుంటే సింహం వెంటనే ఆగిపోయింది. ప్రపంచంలో నన్ను ఇంతగా పరుగెత్తించి తరిమేవాడు ఎవడులేదు వీడు ఎవడు? నన్ను తరుముతున్నాడు? అని తన నోటిలో ఉన్న గొఱ్ఱెపిల్లను ప్రక్కనపెట్టి దావీదు మీద దాడిచేయడానికి వస్తుంది. దావీదు ఆ సింహము విషయంలో పెద్దగా కష్టపడలేదు. తేలికగానే గడ్డంపట్టి నేలకేసి కొట్టగానే సింహము చనిపోయింది. దావీదు బాలుడే కాని సింహమును చంపినవాడు. సింహమును చంపుతున్నప్పుడు ఎవరి సహాయమునైన తీసుకున్నాడా? ఏమైన ఆయుధాలు వాడాడా? లేదు. దేని సహాయం లేకుండా తన చేతులతోనే సింహాన్ని చంపివేసాడు.

దేవుడు బలహీనులను శక్తిహీనులను బలవంతులుగా మారుస్తానని సెలవిస్తున్నాడు. ధైర్యములేని వారిని ధైర్యవంతులుగా మారుస్తాడు. నీకు ధైర్యం లేకపోవచ్చు సింహములాంటి సమస్యలు పోరాటాల మధ్యలో వాటిని ఎదుర్కొనలేక అన్నింటిలో శక్తి హీనునిగా బలహీనునిగా నీవు ఉండవచ్చు బలహీనుడవైన నీతో దావీదువలె బలవంతులుగా చేస్తానని ప్రభువు సెలవిస్తున్నాడు.

దావీదు ఇంతటి శక్తిమంతునిగా బలవంతునిగా ఉండడానికి కొన్ని కారణాలున్నాయి. 1.దావీదు దివారాత్రులు వాక్యాన్ని ధ్యానించేవాడు. 2. దావీదు మంచి ప్రార్థనాపరుడు. 3. మంచి ఆరాధికుడు. 4. పరిశుద్ధాత్మ శక్తిని పొందినవాడు. ఇందునుబట్టి దావీదు శక్తివంతునిగా మారాడు. దావీదు దివారాత్రులు వాక్యాన్ని ధ్యానించేవాడు, వాక్యాన్ని ధ్యానించడం ద్వారా వాక్యం జీవముకలిగినదై శరీరములోనికి వెళ్లి రక్తమాంసములో వాక్యం ప్రవేశించినప్పుడు బలము శక్తి కలిగినది. అందుకే దావీదు జుంటితేనె ధారలకన్న మధురమైనది నీ వాక్యము అంటున్నాడు. నీ వాక్యమే నన్ను బ్రతికించెను బాధలలో నెమ్మదినిచ్చెను అంటున్నాడు. ఈ విధంగా వాక్యంద్వారా బలంపొందుకున్నవ్యక్తి దావీదు. పరిశుద్ధలేఖనాలను ధ్యానించినప్పుడు నీకు బలముశక్తి కలుగుతుంది. వాక్యమే నీకు సర్వరోగనివారిని. వాక్యం యొద్దకు రా... వాక్యాన్ని ధ్యానించు, ఆరాధించు నీ శరీరంలో ఉన్న అది ఏబలహీనతయైన కన్పించకుండాపోతుంది. తాను మహారాజైనా కూడ రోజుకు ఏడుసార్లు ప్రార్థించే ప్రార్థనాపరుడు. ప్రార్థనాశక్తి దావీదుకు ఉ

న్నది. ప్రార్థన చనిపోయినవారిని లేపుతుంది, సూర్యచంద్రులను ఆపివేస్తుంది. ఆకాశం నుండి మన్నాను కురిపిస్తుంది, సముద్రాన్ని పాయలుచేస్తుంది. ప్రార్థనాశక్తిని, అనుభవమును పొందినవాడు దావీదు. అంతేకాదు మంచి ఆరాధికుడు. అది ఏసమయమైనా దేవున్ని ఆరాధించే ఆరాధికుడు. ఎన్నో పాటలను వ్రాసి ఆరాధనచేసి ఆత్మాభిషేకాన్ని పొందుకున్న అభిషక్తుడు దావీదు. ఆరాధనలో గొప్ప శక్తి దాగి ఉన్నది. పౌలు సీలలు ఆరాధిస్తూఉండగా చెరసాల బ్రద్ధలైంది. దావీదు పూర్ణబలముతో పూర్ణమనస్సుతో ఆరాధించాడు గనుక పరిశుద్ధాత్మశక్తి అతనిమీదకు వచ్చింది.

సర్వశక్తిగల దేవుని వాక్యం నీ శరీర రుగ్మతలన్ని కూడ 1.వాక్యం ద్వారా 2.అభిషేకం ద్వారా 3. ఆరాధించడం ద్వారా 4.ప్రార్థించడం ద్వారా వాటిని తొలగిస్తాడు. మంచి ప్రార్థనపరునిగా ఆరాధికునిగా అభిషేకం కలిగినవాడై దేవుని వాక్యాన్ని ధ్యానించినందువల్ల సింహముయొక్క గడ్డముపట్టి దాన్ని నేలకేసి కొట్టి చంపాడు. దేవునిశక్తి దావీదు కలిగియున్నాడు. కాబట్టి సింహం దావీదుచేతిలో చనిపోయింది.

దావీదు గొల్యాతుముందర ఉన్నాడు. గొల్యాతు- ఒరేయ్ నేను కుక్కననుకొని వచ్చావా? నీ మాంసాన్ని ఆకాశపక్షులకు వేస్తానని చెప్పి దావీదుపైకి గొల్యాతు యుద్ధానికి వస్తుండగా దావీదు గుండె చెదరనివాడై వెనుకకు అడుగులు వేసినట్లుగానేవేసి తన ఒడిసెలను తీసి సంచిలో ఉన్న చిన్నరాయితో గొల్యాతు నుదుటకొట్టగా చనిపోయిపడిపోయాడు. వెంటనే దావీదు పరుగెత్తి గొల్యాతు చాతిమీద కాలుపెట్టి ఖడ్గాన్నితీసి తలను నరికి గొల్యాతు తలను చేతిలో పట్టుకొని వస్తున్నాడు దావీదు. ఏ గొల్యాతును చూసి 40 రోజులు ఇశ్రాయేలు ప్రజలు వణికిపోయారో అదే గొల్యాతును కత్తితో నరికాడు దావీదు. దేవుని నామమునుబట్టి, పరిశు ద్ధాత్మశక్తినిబట్టి, ప్రార్థనా జీవితముతో, ఆరాధనా ద్వారా వచ్చే శక్తినిబట్టి వాక్యం ద్వార కలిగిన శక్తినిబట్టి ధైర్యవంతుడై దావీదు గొల్యాతును చంపి వాని కత్తితో వాని తలనే నరికినవాడు దావీదు. దావీదు అంతటి ధైర్యమును దేవునియొద్దనుండి పొందుకున్నాడు.

నరకంలో పడే మొదటిగుంపు పిరికివారు అని ప్రకటనగ్రంథంలో వ్రాయబడి ఉంది. దేవునిబిడ్డలు పిరికివారై ఉండకూడదు. ధైర్యం కలిగినవారిగా మారాలి. మన మీదికి వచ్చే పరిశుద్ధాత్మశక్తి ద్వారా ధైర్యపరిచే అభిషేకము పొందుతావు. అందుకే పరిశుద్ధాత్మను పొంది శక్తివంతులుగా బలవంతులుగా మారి పిరికితనాన్ని గుండెల్లోనుండి తీసివేయండి. యేసయ్యరక్తంలో కడుగబడిన బిడ్డలపై ఈ లోకంలో ఉన్న దుష్టుడు ఏ హాని చేయడానికి వానికి అధికారం లేదు. ధైర్యముగల ప్రజలుగా బ్రతకండి. దేవుడు పిరికితనాన్ని ఇవ్వలేదు ధైర్యంగల ఆత్మనే ఇచ్చాడు. అంతటి ధైర్యం నీకు ఎలా వస్తుంది? 1. వాక్యాన్ని ధ్యానించడంద్వారా, 2. ప్రార్థన చేయడంద్వారా, 3. ప్రభువుని ఆరాధించడం ద్వారా, 4. పరిశుద్ధాత్మను పొందడము ద్వారా ధైర్యము కలుగుతుంది.

దేవుని బిడ్డలారా, ధైర్యముచెడి ఉన్నారా? నేను మిమ్మల్ని శక్తిమంతులుగా మారుస్తాను అని దేవుడు సెలవిస్తున్నాడు. వాక్యముద్వారా ప్రార్థన, అభిషేకం ఆరాధన ద్వారా మిమ్మల్ని

శక్తివంతులుగా మార్చి, మీలో ఉన్న శక్తిహీనత బలహీనత తొలగించి దావీదువలె ధైర్యశాలిగా ప్రభువు మారుస్తాడు. అవిశ్వాసం, అపనమ్మకం, వాగ్ధానాలు నమ్మకపోవడం, ఉపవాసం ఉండకపోవడం మొదలైన బలహీనతలు ఎన్నో ఉన్నాయి. నీ బలహీనతలన్ని తొలగించి నిన్ను శక్తివంతునిగా దేవుడుచేస్తాడు. ఇప్పుడు మీరు శక్తివంతులుగా మారిపోయారు. దావీదు సంతతివారు దేవునివంటివారుగా మారిపోయారు. సింహానికి సింహమే పుడుతుంది. పరిశుద్ధులకు పరిశుద్ధులే జన్మిస్తారు. దావీదు సంతానము దేవునివలె ఉన్నారు. శక్తిహీనులు దావీదువలె దావీదు సంతానం దేవునివలె మారిపోయారు. మనందరం దావీదు సంతానమే. దావీదు సంతానమైన మనందరం దేవునివలె మారిపోవాలి. దేవునివలె మారడం అనగా దైవస్వభావాన్ని ధరించుకోవాలి. మనలో ఉన్న మానవ స్వభావమును విడిచిపెట్టి దేవుని స్వభావాన్ని ధరించాలి. **"అనగా క్రీస్తుకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు, ఆయన ఈలాగు నియమించెను." ఎఫెస్సీ 4:12**

ప్రభువుయొక్క సమానత్వంలోకి ఎదగాలి. అనగా ప్రభువు విశ్వాసంలో, ప్రార్థనలో, పరిశుద్ధతలో అన్నింటిలో సంపూర్ణునిగా ప్రభువు ఎలా ఉన్నారో అలాగే దేవుని ప్రజలమైన మనం దేవుని సమానత్వంలోనికి రావాలి. నీకున్న ప్రేమ, విశ్వాసం, యదార్థత, సమర్పణ మొదలైన అనుభవాలన్నిటిలో నీ వున్న స్థితినుండి సంపూర్ణతలోనికి రావాలి. సంపూర్ణస్థితి వచ్చినప్పుడు దేవుని వంటివారమవుతాం. ఇప్పుడు నీవు కలిగిన రూపం ఆదాము రూపం. ఈ రూపంలోనుండి విశ్వాసంలో, పరిశుద్ధతలో, ప్రార్థనలో మొదలైన అనుభవాలలో రోజురోజుకి అభివృద్ధిపరచబడి ఒకానొక దినమున పెళ్లికుమార్తెగా ఏడేండ్ల విందులో ఉంటాము. సంపూర్ణులు మాత్రమే రాకడలో ఎత్తబడతారు. దావీదు సంతతి దేవునివంటివారుగా మారినరీతిగా మనందరం దేవుని ఆత్మను పొంది యేసయ్యరూపం ధరించాలి. యేసయ్య పోలికలోనికి సంపూర్తిగా మారిపోవాలి. ఆయన నడచినట్లుగా నడవాలి ఆయన మాట్లాడినట్లుగా మాట్లాడాలి. ఆయన చూసినట్లుగా చూడాలి. ఆయన ప్రవర్తనే నీకు ఉండాలి. సమస్తము యేసువలె మారాలి. దైవస్వభావాన్ని సంఘములో, సమాజములో కనబరచినప్పుడు నిన్ను చూసిన వారందరు యేసయ్యనే చూసినట్లుగా సాక్షము చెప్పాలి. యేసయ్యలో ఉన్న ప్రేమ, తగ్గింపు, వినయవిధేయత, సమర్పణ నీలో ఉండాలి. మనం ఆయనవలె మారడానికే ప్రభువు 2015 సం॥క్రితమే కల్వరి సిలువలో తన రక్తాన్ని కార్చి, ఆ రక్తము ద్వారానే మన పాపములను కడిగాడు. ఎందుకు ఈ కార్యము ప్రభువు చేసాడు? నిన్ను యేసువలె మార్చడానికే. దేవుడు తన స్వరూపమందు తనపోలిక చొప్పున నరుని సృజించాడు. ఇప్పుడు నీలో ఉన్న శరీరసంబంధ ఆశలు, కోరికలు, వ్యామోహాలు, అలంకరణ ఇవి సాతాను నుండి వచ్చినవే కాని దేవునికి సంబంధించినవి కావు. వాటిని తొలగించి యేసువలే మారాలి. **"నేను జయించి నా తండ్రితో కూడా ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతో కూడ నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను" ప్రకటన3:22** నీవు దేవునివలె ఎదిగితే ఆయన కూర్చుండే సింహాసనంపై నిన్ను ఎక్కిస్తాడు. M.L.A, M.P,

**CM** ఎవరైన నాయకుల వద్దకు మనమువెళ్తే క్రిందగాని యితర కుర్చీలలో కూర్చోమని అంటారు కాని వారి కుర్చిలు ఇవ్వరు. కాని మనం యేసయ్యవలె మారినప్పుడు ఆయనకూర్చున్న సింహాసనం మనకు ఇస్తాడు. యేసువలె తలంచాలి, ఆలోచించాలి, నడవాలి మాట్లాడాలి. ఈ లోకంలో ఉన్న ఎవరివలె మనంజీవించక దేవునివలె జీవించాలి. దేవునివలెనే మనం జీవించుదుము గాకా.

తర్వాత **"జనుల దృష్టికి యెహోవా దూతలవంటి వారుగాను ఉందురు"** బయట సమాజంలోనికి వెళ్లినప్పుడు ప్రజలు మిమ్మల్ని చూసినప్పుడు దేవదూతల వలె కన్పించాలి. నీ మాట క్రియలు ఆచార సాంప్రదాయాలు మారి నీవు దైవికంగా ఎదుగుతున్నావు గనుక నీలో మార్పును చూసి దేవదూతల వలె వారికి కన్పిస్తావు.

శక్తిహీనులు దావీదువలె, దావీదు సంతతిని దేవుని సంతతిగా లోకానికి దేవదూతలవలె ప్రభువు చేస్తాడు. ప్రియమైన దైవజనాంగమా, బలహీనమైన మనల్ని దావీదువలె మార్చి దావీదు సంతతిలో ఉన్న మనల్ని దైవస్వభావంలోనికి ఎదిగించి దేవునివంటివారుగా మార్చి లోకానికి దేవదూతలవలె కన్పించునట్లుగా దేవుడు చేస్తాడు. లోకానికి దేవదూతలవలె కన్పించాలి. నిన్ను చూసినప్పుడు వారు ఆశ్చర్యపడాలి. నీమాటలు, క్రియలు, పద్దతులు చూసినప్పుడు ప్రజలు ఆశ్చర్యపడాలి. లోకానికి దేవదూతలవలె కన్పించినప్పుడు నిన్ను చూసి నీలో దేవున్ని చూస్తున్నామని అంటారు. అటువంటి కృప మీకు దేవుడు దయచేయును గాకా. ఆమెన్...

---

# యాకోబులో ఏ దోషము లేదు

**దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాడు ఆయన చెప్పి చేయకుండునా? ఆయన మాట యిచ్చి స్థాపింపకుండునా? ఇదిగో దీవించుమని నాకు సెలవాయెను ఆయన దీవించెను, నేను దాని మార్చలేను. ఆయన యాకోబులో ఏ దోషమును కనుగొనలేదు ఇశ్రాయేలులో ఏ వంకరతనమును చూడలేదు. అతని దేవుడైన యెహోవా అతనికి తోడైయున్నాడు. సంఖ్యా 23:19**

చదువబడిన పై లేఖనభాగాలలో బిలాము ప్రవక్త దేవుని ఆత్మచేత నింపబడినవాడై ఈ మాటలు పలుకుతున్నట్లుగా మనము చూస్తాము. "బిలాము ఉపమానరీతిగా యిట్లనెను" ప్రియమైన దేవుని బిడ్డలారా! బిలాము ప్రవక్త ఇశ్రాయేలు ప్రజలను శపించడానికి బాలాకు అనే రాజు చాలా ధనాన్ని లంచంగా పెట్టి, బిలాము ప్రవక్తను తీసుకువచ్చాడు. ఇశ్రాయేలు

ప్రజలు ఐగుప్తు దేశాన్ని విడిచి కానాను దేశానికి ప్రయాణమై వెళ్తున్నారు. మార్గ మధ్యంలో మోయాబు దేశానికి వచ్చారు. మోయాబు దేశాన్ని పరిపాలిస్తున్న బాలాకు రాజు ఇశ్రాయేలు ప్రజలను పోనివ్వకుండా, మీరు మాదేశం గుండావెళ్లడానికి వీలులేదు, మేము వెళ్లనివ్వమని చెప్పాడు. మీ దేశాన్ని మేము పాడుచేయము ఎటువంటి నష్టమును కలుగజేయము మేము కానాను దేశానికి వెళ్లడానికి కాస్త త్రోవను ఇవ్వండి అని మోషే బాలాకు రాజును అడిగాడు. ఇశ్రాయేలీయులందరు కూడా మైదానములో ఉన్నారు. వారందరిని చూసిన రాజు గుండెల్లో భయంపుట్టి తన దేశంలో ఉన్న బిలాము ప్రవక్తను సంప్రదించాడు. ఈ ప్రవక్త ఎవరిని శపిస్తాడో వారు శపించబడతారు, ఎవరిని ఆశీర్వదిస్తాడో వారు ఆశీర్వదించబడుదురు. బిలాము ఒక మంచి ప్రవక్త అని దేశప్రజలకు మహారాజుతో సహా అందరికి ఈ విషయం తెలుసు. ప్రవక్తయైన బిలాము వద్దకు రాజు డబ్బుసంచిని పంపించాడు. ఈ డబ్బుతీసుకొని వచ్చిన ఇశ్రాయేలీయులకు శాపవచనం పలుకుమని రాజు బిలాముతో చెప్పాడు. మొదటిసారి రాలేనని చెప్పాడు, తర్వాత దేవుడు చెప్పేవరకు రాలేనని అన్నాడు, తర్వాత డబ్బుకు అమ్ముడుపోయి ప్రవక్త ఇశ్రాయేలీయులను శపించడానికి కొండ ఎక్కాడు. ఇశ్రాయేలు ప్రజలను చూసి శాపవచనం పలుకుమని రాజుచెప్పితే, బిలాము దేవునిఆత్మచేత నిండినవాడై ఆశీర్వచనం పలికాడు. నిజానికి శాపంపెట్టడానికి వచ్చిన వ్యక్తి ఇశ్రాయేలు ప్రజలను చూసి, దీవించాడు. ఎంతో డబ్బులు లంచంపెట్టి కొన్నటువంటి రాజు ప్రక్కనే ఉన్నాడు. ఈయన నోటినుండి ఏదివస్తే అది జరుగుతుందని రాజుకు తెలుసు. ఈ ధనమంతా తీసుకో, ఇంకా నీవు కోరినంత ధనాన్ని ఇస్తాను కాని ఈ ప్రజలను శపించు, అప్పుడు నేను యుద్ధానికి వెళ్లి వారినందరిని చంపేస్తాను అని అంటున్నాడు బాలాకు రాజు. బిలాముప్రవక్త శాపం పెట్టడానికి తన నోరు తెరిచాడు కాని శాపవచనం రాకుండా ఆశీర్వచనం అతని నోటిలోనుండి వచ్చాయి. ఎందుకలా జరిగిందంటే! దేవుడేవచ్చి అతనినోట ఆశీర్వాదపు పలుకులు పెట్టాడు. బిలాముకు శాపం పెట్టాలని ఉంది.

**"దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాడు. ఆయన చెప్పి చేయకుండునా? ఆయన మాట యిచ్చి స్థాపింపకుండునా?ఇదిగో దీవించుమని నాకు సెలవాయెను ఆయన దీవించెను. నేను దాని మార్చలేను" (సంఖ్యా 23 :19).** అని పలికాడు. దేవుడు ఆశీర్వదించగా దాన్ని మార్చడానికి బిలాము ఎవరు? ప్రవక్తే కావచ్చు, పాస్టర్, అపోస్తలుడే, దర్శనాలు చూసేవాడే కావచ్చు, దేవుడు దీవించగా దాన్ని మార్చగలిగే శక్తి ఎవరికి లేదు. ప్రియ చదువరులారా! దేవుడే మనల్ని ఆశీర్వదించాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ ప్రపంచంలో ఎవరు కూడా ఆయన నిర్ణయాన్ని మార్చలేరు. దేవుడు బిలాముకంటే ముందుగానే దీవించాడు. యాకోబును దీవించిన తర్వాత బిలాము శాపం పెట్టుటకు వస్తే, దేవుడు ఏనిర్ణయమైతే తీసుకున్నాడో ఆ నిర్ణయాన్ని అలాగే స్థిరపరచబడునట్లుగా శాపం పెట్టడానికి వచ్చిన బిలాము ద్వారా ప్రజలను దీవించాడు. ఇలా దీవెనలకు పాత్రులుగా అర్హులుగా యాకోబు జీవించాడు. యాకోబు దీవించబడడానికి కారణాలు అక్కడ వ్రాయబడి ఉన్నాయి. **"ఆయన యాకోబులో ఏ**

**దోషమును కనుగొనలేదు ఇశ్రాయేలులో ఏ వంకరతనమును చూడలేదు."సంఖ్యా 23:19.**

యాకోబులో దోషం ఉంటే బిలాము శాపం పనిచేసేది. యాకోబులో ఎందుకు దోషం లేదు? యాకోబుకు ఇద్దరు భార్యలు లేరా? యాకోబు తన మామను మోసగించి ఆస్తి సంపాదించలేదా? యాకోబు తన అన్నకు రావలసిన ఆశీర్వాదాలను నేను ఏశావునే అని చెప్పి దొంగిలించలేదా? దోషం ఎందుకు లేదు? దోషం ఉంది కాని యాకోబులో దోషం లేదని దేవుడే మాట్లాడుతున్నాడు. యాకోబు జీవించినది ధర్మశాస్త్రకాలము. ఆ కాలములో ఆజ్ఞలు లేవు, మనస్సాక్షికాలము, మనస్సాక్షి ఏది చెప్పితే అది చేస్తారు, ఎలా నడిపిస్తే అలా నడిచారు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! యాకోబులో ఏదోషం లేదని దేవుడు చెప్తున్నాడు. అవును! యాకోబులో ఇవి దోషాలు అనిపిస్తున్నాయి. యాకోబు వాళ్ల మామను మోసం చేసినట్లుగా మనం చూస్తున్నాం కాని వాస్తవంగా యాకోబు ఎంతైతే కష్టపడ్డాడో అంత జీతమును మామ ఇవ్వలేదు. తన కష్టానికి రావలసిన జీతం ఇవ్వలేదు. తర్వాత రాహేలును పెళ్లిచేస్తానని లేయాను చేసాడు. అసలు ఇద్దరి భార్యలను చేసుకునే ఆశ యాకోబుకు లేదు. రాహేలును పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కాని తన మామ గుడ్డిదైన లేయాతో పెళ్లి చేసాడు. ఆ దినాలలో పెళ్లి చూపులు లేవు. పెళ్లైనతర్వాతనే తన భార్యను చూడాలి. అమ్మాయికి ముసుగు వేసారు, పెళ్లికిముందు అమ్మాయిని చూడకూడదు. ఏమిటి మామ ఇలా చేసావు? అని అంటే పెద్ద అమ్మాయికి చేయకుండా చిన్న అమ్మాయికి పెళ్లి ఎలా చేస్తాము? ఇదిగో చిన్న అమ్మాయిని కూడా నీకే పెళ్లి చేస్తానని చెప్పినప్పుడు ఇద్దరు భార్యలు అయినారు. అంతేకాని యాకోబు తెలిసి కావాలని చేసుకోలేదు. యాకోబు తప్పు చేయాలని ఎక్కడా ప్రయత్నించలేదు. అన్నకు రావలసిన ఆశీర్వాదాలు తాను దొంగిలించాలని, తనే స్వంతంగా వెళ్లి “అమ్మా! నాన్నగారు అన్నకు ఆశీర్వాదాలు ఇస్తున్నాడు. నాకు ఆశీర్వాదాలు కావాలని నన్ను ఏమి చేయమంటావమ్మా” అని తన తల్లిని అడిగాడా? అడగలేదు. తల్లే చేసింది మీ అన్నను నాన్నగారు దీవిస్తున్నారు. నీవు ఏంటి మౌనంగా ఉన్నావు? రా! నేనొక ఆలోచన చెప్తానని అంటే యాకోబు“నాన్న నా స్వరం గుర్తుపడ్తాడు” అని అంటున్నా ఏమికాదు, ఇలాచేయుమని అన్నకు రావలసిన ఆశీర్వాదాలను యాకోబుకు రావడానికి ప్రయత్నించింది తల్లే కాని యాకోబు కాదు. ఈ విషయంలో యాకోబుది తప్పులేదు, పెళ్లిదగ్గర తప్పులేదు, కష్టార్జితం దగ్గరకూడ యాకోబుది తప్పులేదు. అందుకే దేవుడు అంటున్నాడు “యాకోబులో ఏ దోషం లేదు”.

యాకోబు ఎంత యథార్థవంతుడో భక్తిపరుడో గమనించండి! యాకోబు తన తల్లి సహోదరుడు మామయైన లాబాను ఇంటికి వెళ్లాడు. అతను పచ్చి విగ్రహారాధికుడు. వాళ్లఇంట్లో అన్ని దేవతలు దేవుళ్ల విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ ఉంటే నిన్ను నీ అన్న ఏశావు చంపేస్తాడు. తనకు రావలసిన ఆశీర్వాదాలను నీవు తీసుకున్నావని ఏశావు పగబట్టియున్నాడని తల్లి తన సహోదరుడైన లాబాను ఇంటికి యాకోబును పంపించింది. లాబాను ఎన్ని రోజులు యాకోబుని

పోశిస్తాడు? చివరగా జీతానికి మాట్లాడుకున్నాడు. మామ విగ్రహారాధన చేస్తున్నాడు, మామ కూతుళ్లు లేయా, రాహేలు మరియు కుటుంబమంతా విగ్రహారాధన చేస్తున్నారు. విగ్రహారాధన చేసేఇంటికి దైవికమైన దర్శనాలను చూసేవాడు వెళ్లాడు. ఇంటిలోనుండి వస్తున్నప్పుడు ఒక స్థలములో రాత్రియైందని ఆ స్థలములో చిన్నరాయి తీసుకొని తలగడగా పెట్టుకని ఆరాత్రి పడుకున్నాడు. దేవదూతలు ప్రత్యక్షమైనారు. దైవప్రత్యక్షత కలవాడు, దర్శనాలు చూసేవాడు విగ్రహారాధన చేసే ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత విగ్రహారాధన చేస్తున్న వారితో కలిసి ఉంటూ, భోజనం చేస్తూ, పనిచేస్తూ తిరుగుతున్నాడు. కాని ఏనాడు మామయైన లాబాను గృహదేవతలను పూజించలేదు. ఇలా దినాలు సాగుతున్నాయి. మామకు యిద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దదానిపేరు లేయా, చిన్నదానిపేరు రాహేలు. వరుసకు మర్దలు అవుతుంది రాహేలును యాకోబు ప్రేమించాడు. గమనించండి! రాహేలును ప్రేమించాడు కాని రాహేలు పూజిస్తున్న విగ్రహాలను పూజించలేదు. మామ చేస్తున్న పండుగలలో పాల్గొనలేదు అతను ఉచ్చరించే మంత్రాలను ఉచ్ఛరింపలేదు. అల్లుడు రా! పనివాళ్లు అందరు కూర్చున్నారు, ఈరోజు పనిలేదు పూజచేద్దాం రా! అని పిలిచినప్పుడు, నాకు ఇవేమి కుదరవని, నాకు నా దేవుడున్నాడని చెప్పాడు.

అందుకే దేవుడు "నేను యాకోబు దేవుడనని చెప్పుటకు సిగ్గుపడనని" అన్నాడు. ఎందుకు? సిగ్గుపడే పని యాకోబు చేయలేదు. మామ తెలిసి గుడ్డిదైన లేయాతో పెళ్లి చేసి మోసం చేసాడు. ఎక్కడా పొరపాటున తప్పుచేయాలని పాపం చేయాలని ఆలోచన లేనివాడు యాకోబు. దాదాపు 20 సం॥లు మామ దగ్గర ఉన్నాడు కాని విగ్రహారాధన ద్వారా తనకు ఏ దోషం అంటకుండా కాపాడుకున్నాడు. రాహేలును ప్రేమించాడు. రాహేలుకైతే నిజమైన దేవుని గురించి తెలియనే తెలియదు. "పూజ చేద్దాం రండి! అని పిలిచినా, నా భక్తి విషయంలో జోక్యం చేసుకోవద్దు. నాకు దర్శనమిచ్చిన , నా తండ్రి దేవుడున్నాడు. ఆయననే నేను కొలుస్తాను, పూజిస్తాను, ఆరాధిస్తాను, ఆయనతోనే బ్రతుకుతా, ఆయనతోనే చస్తానుగాని నీవు మ్రొక్కుమనిచెప్పిన దానిని మ్రొక్కడానికి ఒప్పుకోను. ఒక వేళ రాహేలు పూజించిన దానిని యాకోబు పూజిస్తే యాకోబుపేరు బైబిల్లో ఉండేది కాదు. అందుకే దేవుడు "యాకోబులో ఏ దోషం లేదు" అని అంటున్నాడు.

ఈ భూమిమీద ఆశీర్వదింపబడిన వ్యక్తిగా నీవు వుండాలంటే నీలో కూడా ఏదోషం దేవునికి కన్పించకూడదు. తన మామ మరియు తన భార్యలు అన్యులైనప్పటికి వారిని దేవుని వైపు త్రిప్పాడు కాని యాకోబు మాత్రం వారి దేవతలతట్టు తిరగలేదు. నా దేవుడు ఉన్నవాడు, భూమ్యాకాశములను సృష్టించినవాడు, జీవముగల, పరలోకమందున్న దేవునినే నేను మ్రొక్కుతున్నాను గనుక మీరు కూడా నేను ఆరాధించే దేవునినే ఆరాధించాలి అని తన భార్యలతో ఖండితముగా చెప్పాడు. వారు మీవైపు తిరగాలి కాని మీరు వారివైపు తిరగకూడదు. ఈరోజు మీకు అన్య ప్రజలైన కొందరు బంధువులున్నారు. నీవు దేవునిని నమ్మావు ఐతే నీవు వారిని రక్షించాలా? లేదా నీవే వారి ఆచారాలవైపు తిరగాలా? యాకోబుఒక్కడు లాబాను యొక్క

కుటుంబసభ్యుల మెజారిటీ ఎక్కువ అయినా ఒక్కడు దేవునికోసం నమ్మకంగా నిలబడ్డాడు. విగ్రహారాధనచేసే బంధువులు నిన్ను "మేము పండుగచేసుకుంటున్నాము, మా ఇంటికి రమ్మని" పిలిచినప్పుడు ఎలా స్పందిస్తున్నావు? నేను రాలేను అని చెప్తున్నావా? లేదా వస్తాను కాని నా భోజనం నాకు, నా సామాగ్రినాకు వేరుగా చేసిపెట్టాలని చెప్పి వారితోనే కలిసిపోతున్నావా? ఇలాగే ఒక విశ్వాసి అన్యఆచారాలకు వెళ్లింది, వస్తున్నప్పుడు ఒక దయ్యాన్ని వెంటబెట్టుకొని వచ్చింది. ఆరోగ్యం బాగుపడక కొన్ని రోజులకు మరణించింది. మనం వాటి చోటికి, ప్రాంతాలకు వెళ్లకూడదు. అనవసరమైన విషయాలలో జోక్యం కలిగించుకోకూడదు. యాకోబు విగ్రహారాధికుడైన మామ ఇంట్లోనే కుటుంబస్థులతో కలిసిఉన్నాడు. వారి ఆచారాలను యాకోబు వెంబడించక దోషం లేనివ్యక్తిగా ప్రతిష్టను, పవిత్రతను, తన దర్శనమును, తండ్రియైన దేవునిపట్ల విధేయతను కాపాడుకొనుచు దేవుని కనుసైగలలో జీవించాడే గాని విగ్రహారాధన ద్వారా ఏ దోషం తను అంటించుకోలేదు.

ఇశ్రాయేలు దేవుడు దోషం లేనివారినే దీవిస్తాడు. దోషంలేని వ్యక్తిగా నీవు జీవించినప్పుడు దేవుడు యాకోబును దీవించినట్లుగా నిశ్చయముగా నిన్ను దీవిస్తాడు. ఏలాంటి దోషం అంటనివ్వకూడదు. ఎందుకంటే నీవు దీవించబడిన ఆశీర్వదించబడిన వ్యక్తిగా బ్రతకాలని ప్రభువు కోరుకుంటున్నారు. దేవునిప్రజలే దేవుని దీవెనలకుఅర్హులు గనుక వాటిని అనుభవించాలంటే అన్యఆచారల, నామకార్ధపుఆచారాల ద్వారా వచ్చేదోషం నిన్ను అంటనివ్వకూడదు.

ఇశ్రాయేలు ప్రజలు ఇదే కానాను యాత్రలో ముందుకు వెళ్తున్నారు. మోషే చనిపోయిన తర్వాత యెహోషువా నాయకుడుగా ఉన్నాడు. దేవుడు ఇశ్రాయేలీయులతో- ఈ యెరికో పట్టణమును మీ చేతులకు అప్పగించుచున్నాను, మీరు వెళ్లి యుద్ధంచేసి, ఆ పట్టణములో ఉన్న వెండిని, బంగారమును విలువైన వస్తువులను మీరు తీసుకువచ్చి నా మందిరములో ఉంచండి. యెరికోను మొత్తం సర్వనాశనం చేయండి. ఆ పట్టణములో ఉన్నదంతా శపించబడినవి వాటిని కాల్చివేసి విలువైన వస్తువులను ఇంటికి తీసుకువెళ్లకూడదని నా మందిరములో ఉంచండి అని ఖచ్చితముగా దేవుడు చెప్పాడు. అంతా నాశనం చేసారు, పట్టణం మీద విజయాన్ని సాధించారు. ఐతే ఒకవ్యక్తి దేవుడు ఏవైతే విలువైన వస్తువులను నా మందిరములో పెట్టాలని చెప్పితే, వాడు మందిరములో పెట్టకుండా తన ఇంటికి తీసుకువెళ్లి ఇల్లు మధ్యలో గుంతత్రవ్వి వాటిని పాటిపెట్టాడు. అతని పేరు ఆకాను. ఇతను చేసిన పాపానికి ఇశ్రాయేలు సర్వసమాజానికి దోషం అంటింది. సంఘంలో కూడా ఒకరు తప్పుచేసినా దాని దోషమంతా సంఘము మీదికి వస్తుంది. అంటే ఒక్కొక్క వ్యక్తి ఎంతజాగ్రత్తగా బ్రతకాలో ఆలోచించండి! నీవు సంఘాన్ని నష్టపెట్టి, బాధపెట్టే వ్యక్తిగా బ్రతకవద్దు. ఇశ్రాయేలీయులకు దోషం అంటడమునుబట్టి వారు చిన్న గ్రామాన్నికూడా జయించలేక శత్రువుల చేతిలో ఓడిపోయారు. యెహోషువా తన బట్టలు చింపుకుని-మేమెందుకు శత్రువుల చేతిలో ఓడిపోయాము, మాతప్పేమిటి? అని దేవున్ని అడిగినప్పుడు, మీలో ఒకడు...- **దేవుడు సొమ్ములో**

**ఒక మంచి షీనారు పై వస్త్రమును రెండువందల తులముల వెండిని ఏబది తులముల ఎత్తుగల ఒక బంగారు కమ్మిని నేను చూచి వాటిని ఆశించి తీసికొంటిని. అదిగో నా డేరా మధ్య అవి భూమిలో దాచబడి యున్నవి. ఆవెండి దానిక్రింద ఉన్నదని ఉత్తరమిచ్చి తాను చెసినదంతయు ఒప్పుకొనెను. యెహోషువా 7: 21**వస్తుంది. నీద్వారా సంఘములో ఉన్నవారికి కూడా శిక్షవస్తుంది. ఆకాను చేసిన తప్పుకు దేవుడు ఇశ్రాయేలు సర్వసమాజమును విడిచి వెళ్లిపోయాడు. ఒక వ్యక్తి సంఘములో నీచమైన కార్యాలుచేస్తే దేవుడు సంఘాన్ని విడిచి వెళ్ళిపోతాడు. నీవు ఒక్కనివి పాపంచేసి సంఘాన్ని బాధపెడ్డావా?

ప్రియచదువరులారా! ఒక్కవ్యక్తినిబట్టి సర్వసమాజంపై దేవుని కోపం వచ్చింది.

**"అప్పుడు యెహోషువా - నీవేల మమ్మును బాధపరిచితివి? నేడు యెహోవా నిన్ను బాధపరచునని ఇశ్రాయేలీయులందరు వానిని రాళ్లతో చావగొట్టిరి (యెహోషువా 7: 25)."** ఆకాను అలాచేసినందుకు అతనిని సన్మానించలేదు రాళ్లతో చావగొట్టారు. మనం పాపం చేసేవారిని, మోసం చేసేవారిని పొగడుతాం. సమాజంలో ఎంతరౌడి అయితే అంత మంచివాడు. కాని దేవుని సమాజం ఆలాంటిదికాదు, కొద్దిదోషమైన ఓర్చుకొనదు. సర్వసమాజం అంతాకలిసి నీవు ఒక్కనివి దేవుడుచేయవద్దన్న పని చేసి, శాపగ్రస్తమైన వాటిని నీ యింట్లో దాచుకొని అందరిమీదికి శాపం తెచ్చావు. అని అతన్ని ఊరిబయటకు తీసుకెళ్ళి రాళ్లతో చావగొట్టారు. ఈరోజు సంఘంలో తప్పుచేస్తే ఖండిస్తున్నావా? ప్రోత్సాహిస్తున్నావా? భయంలేకుండా, అదిపాపమైన చేయు ఏమికాదు అని ప్రోత్సాహపరుస్తున్నావా? ఆకాను రాళ్లతో చంపబడ్డాడు జాగ్రత్త! అన్యఆచారాలను ప్రోత్సాహించకు. ఈ అన్యఆచారల ద్వారా మనకు దోషం అంటుతుంది. తద్వారా దేవుని ఆశీర్వాదం మనకు దూరమవుతుంది. యాకోబు దీవించబడడానికి బలమైన కారణం యాకోబులో ఏ దోషంలేదు.నీవు అన్యఆచారాలను విడిచి, పరిశుద్ధతను, పవిత్రతను కాపాడుకొను చున్నప్పుడు ఇశ్రాయేలు దేవుని దీవెన నీవు నిశ్చయంగా అనుభవిస్తావు. ఎవరు నీ దీవెనను మార్చలేరు. వేటిద్వార నీవు దోషమును అంటించుకున్నావో వాటిని నీవు దూరము చేసుకోవాలి. నీవు దీవించబడాలంటే దేవునికి దోషంలేనివానిగా కన్పించాలి.

పరిశుద్ధగ్రంథంలో అహజ్యా అనే రాజు ఉన్నాడు. ఇతడు ఇశ్రాయేలుప్రజలను పరిపాలిస్తున్నాడు. **"అహజ్య షోమ్రోనులోనున్న తన మేడ గది కిటికిలోనుండి క్రిందపడి రోగియై - మీరు ఎక్రోను దేవతయగు బయల్జెబూబు నొద్దకు పోయి- ఈ వ్యాధి పోగొట్టుకొని నేను స్వస్థత పడుదునోలేదో విచారించుడని దూతలను పంపగా, యెహోవా దూత తిష్బీయుడైన ఏలీయాతో ఈలాగు సెలవిచ్చెను. నీవు లేచి షోమ్రోనురాజు పంపిన దూతలను ఎదుర్కొనబోయి యిట్లనుము- ఇశ్రాయేలువారిలో దేవుడన్నవాడు లేడనుకొని ఎక్రోను దేవతయైన బయల్జెబూబు నొద్ద మీరు విచారించబోవుచున్నారా? కాగా యెహోవా సెలవిచ్చునదేమనగా - నీవెక్కిన మంచము మీదనుండి దిగిరా కుండా నీవు నిశ్చయముగా మరణమువుదువు అని ఏలియా వారితో చెప్పి వెళ్లిపోయెను"**

**(2రాజులు 1:1).** ఇశ్రాయేలీయులు నిజమైన దేవున్ని ఆరాధించేవారు. ఆహజ్యరాజు కిటికీలోనుండి క్రిందపడ్డాడు. కొంతమంది మనుష్యులను పిలిచి మీరు ఎక్రోను దేవత దగ్గరకుపోయి నేను బాగుపడ్తానా?లేదా? చేయుడని ఆ దేవతవద్దకు పంపాడు. నిజమైన దేవున్ని ఆరాధిస్తున్నరాజు, ఒక మంత్రగాని దేవతదగ్గరకు తన దగ్గరఉన్న మనుష్యులను పంపవచ్చా? నిజానికి ఎక్కడికి పంపాలి? మీరు దైవజనుని దగ్గరకు వెళ్లి నా క్షేమము కొరకు ప్రార్థించి చెప్పుమని పంపాలి. ఈ రోజు ఎలాఉంది నీ పరిస్థితి? ఈ అహజ్యరాజు దేవుని నమ్మినవాడై యుండి ఆయన ఊరిలోనే గొప్పదైవజనుడు ఉన్నాడు. అతనిపేరు ఏలియా. ఇతను మండుతున్న సేవకుడు, రోషం కలిగి సేవచేస్తున్నవాడు, ఆకాశం నుండి అగ్నిని రప్పించినవాడు. ఇటువంటి దైవజనుడు రాజు కన్నులకు కన్పించలేదు ఇలాంటి దైవజనున్ని రాజు లెక్కచేయలేదు. దేవతల వద్దకు, మాంత్రికుల వద్దకు తన మనుష్యులను పంపిస్తున్నారు. ఏలియా ఎదురుగా వచ్చి, వారిని ఆపివేసి, ఎక్కినమంచం దిగకుండా చనిపోతాడని మీరాజుకు చెప్పండి. అని చెప్పి వెళ్లిపోయాడు. ఇది చెప్పినవాడు దైవజనుడైన ఏలియా, ఇది వారికి తెలియదు. రాజుదగ్గరకు వచ్చి రాజా!- మేము వెళ్తుంటే ఒకడు గొంగళికప్పుకొని ఎదురువచ్చి, రాజు ఎక్కినమంచం దిగకుండా చస్తాడని చెప్పి వెళ్లిపోయాడు. ఆయన ఎలా ఉన్నాడని రాజు అడిగితే, గొంగలి కప్పుకున్నాడు మొ॥నవి చెప్పగానే అతను దైవజనుడైన ఏలియా అని రాజు వారితో చెప్పాడు.

నీ కష్టాలను కడతేర్చడానికి, కావలసిన ఈవులను ఇచ్చుదేవుడు ఉన్నాడు. కాని కష్టాలు రాగానే అన్య ఆచారాలవైపు, మాంత్రికులవైపు, సోదెగాండ్ర వైపు చూసి దోషముపాలు కావద్దు. దోషం లేని ప్రజలుగా మనం జీవించాలి. మన దోషాన్నిబట్టి మన ఆశీర్వాదాల్ని కోల్పోతాం. అందుకే యాకోబులో దోషం లేనట్లుగా మనం దోషంలేని ప్రజలుగా బ్రతుకుదాం! నీవు నీ పట్టణములో, గ్రామములో, నీ ప్రజలయెడుట దోషం లేని వ్యక్తిగా నీవు జీవించాలి. ఆలా జీవిస్తే వారి కళ్లముందే దేవుడు నిన్ను ఘనపరచి అభివృద్ధిపరచి నీ గ్రామంలో, పట్టణంలో ఎత్తిపట్టుకుంటాడు. ఎటువంటి అన్యఆచారల దోషం మనకు అంటనివ్వక పవిత్రమైన జీవితం చేసి దేవుని దీవెనలు పొందుకొనెదము గాక! నీ బాధలు, కష్టాలు, సమస్యలు తీర్చి, కన్నీరును తుడచి, ఆహారం పెట్టి, వస్త్రాలను ఇచ్చి, వ్యాధులను తొలగించి ఆయుష్షును పొడగించే దేవుడు ఉన్నాడు. సర్వసంపదలు ఘనత ఐశ్వర్యం ఇచ్చేదేవుడే నీకుండగా ఆయనను విడిచి ఎవరెవరికో చేతులు చూయించి, కుటుంబానికి సమాజానికి భయపడి అన్యఆచార సాంప్రదాయాలను పాటించి, ఆత్మీయతను , పరిశుద్దతను విడిచి నీ జీవితాన్ని ఎందుకు పాడుచేసుకుంటావు? గనుక ఏదోషం మనకు అంటనివ్వక దైవికమైన ఆలోచనతో దోషం లేనివారిగా విగ్రహారాధన సంబంధించిన అన్యఆచారా సాంప్రాదాయాలను విడిచి వాక్యానుసారంగా నడచి దేవుని ఆశీర్వాదాలను పొందుకొనెదరుగాక!

**దేవుడు మిమ్ములను దీవించునుగాకా!....**

## సాక్ష్యము

# శాపం నుండి ఆశీర్వాదములోనికి

నా పేరు అగస్టిన్, కాల్వ గ్రామము ఆదిలాబాద్ జిల్లా. నేను హైందవ కుటుంబంలో జన్మించాను. మా తండ్రి చిన్నతనంలోనే మరణించాడు. మా అక్కను, నన్ను మా అమ్మ కూలిపనులు చేస్తూ పెంచింది. మా అమ్మ విగ్రహాలకు ఉపవాసం ఉంటూ పూజలు పునస్కారాలు చేసేది. మా గ్రామంలో ఉన్న చర్చికి పండుగ క్రైస్తవునిగా  అప్పుడప్పుడు వెళ్ళేవాన్ని. చర్చికి వెళ్ళినా విగ్రహపూజలు చేస్తూ ఉండేవారము. యేసయ్య మా కులదేవునిగా మారిపోయాడు. అందరి దేవుళలో యేసయ్య ఒక దేవుడని నమ్మిన కుటుంబంమాది. మా కుటుంబములో చాలా శ్రమలు వచ్చాయి. శాంతి సమాధానం కరువయ్యింది. మా బంధువులతో గొడవలు ఇలా ఉన్న సమయంలో మా ఇంటిప్రక్కవారు నిస్సీచర్చి గురుంచి తెలియజేసి ఉపవాస పండుగలకు మా అక్కను తీసుకువెళ్ళారు. అక్క తరచుగా కడుపునొప్పితో బాధపడేది. దైవజనులు ప్రార్థించగానే క్రిందపడిపోయి అరవడం, ఆమెలో నుండి చీకటిశక్తుల ప్రభావం బయటకు వెళ్ళడంతో స్వస్థత కలిగింది. అలాగే మా అక్క ప్రార్థనవలన నాకు డిగ్రీకాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. తర్వాత కొన్ని సం॥లకు మా అమ్మ చేతబడితో, మంత్రశక్తులతో అరవడం మొదలుపెట్టింది. ఆ రోజంతా అరుస్తూనే ఉన్నది. అదేరోజు నిస్సీచర్చికి తీసుకునివచ్చాము. దైవజనులు ప్రార్థనచేయగా "కాలిపోతున్నాం" అని కేకలువేస్తూ దురాత్మలు వెళ్ళిపోయేవి.  దైవజనులు ప్రార్థనచేస్తే దయ్యాలు మేము కాలిపోతున్నాం అంటూ వెళ్ళేవి. ఒకరోజు నేను ఆలోచించాను దైవజనులు ప్రార్థనచేస్తే కాలిపోతున్నాం అంటూ వెళ్తున్నాయి కదా! మరి నేను ప్రార్థనచేస్తే ఎందుకుపోవు అని బైబిల్ చదువుతుండగా ఉపవాసం ద్వారానే దయ్యాలను వెళ్ళగొట్టవచ్చు అనే వాక్యం చదివి, ఉపవాస ప్రార్థనలు చేయడం ప్రారంభించాను. దయ్యం పట్టినవారికి ప్రార్థించగా అవి వెళ్ళిపోయాయి. మా అమ్మకు నడుముకు పెద్దపుండు అయింది. నీరు కారుతూ ఉండేది. ఎన్ని మందులు వాడిన తగ్గలేదు. ఆ సమయంలో సికింద్రబాద్ పెంతెకోస్తు మహా సభలకు ప్రక్కింటివారితో కలిసి వెళ్ళింది. మేమందరం ప్రతిరోజు కుటుంబ ప్రార్థన చేస్తాము. అలాగే చేస్తుండగా మా అక్క ఆత్మతో నింపబడి నా కుమార్తె స్వస్థతపొంది ఆత్మతో నింపబడి వస్తుంది అని ప్రవచించింది. సభలలో ఉన్న మా అమ్మ విడుదలపొందింది. ఇంటిలో నుండి దయ్యాలు వెళ్ళిపోవడం ఆ సభలలో చూసింది. ఆ పుండు కూడా తగ్గింది. నేను అమ్మ బాప్తీస్మంపొందాము. ప్రతివారం బలమైన వాక్యాహారంతో బలపరచబడి, నిరీక్షణతో పరలోకరాజ్యం కొరకు ఎదురు చూచుచు సాగిపోతున్నాం.  నేను ప్రతిరోజు ప్రార్థనచేస్తూ, బైబిల్ చదవడం, దేవుని ఆత్మతో సంభాషించడం జరిగేది. అలాగే నా వివాహ విషయంలో దేవుడు సహాయం చేసాడు. నాకు చక్కని భార్యను పాపను కూడా దేవుడు అనుగ్రహించాడు. నిస్సీ ప్రార్థనామందిర సహవాసానికి వస్తున్నప్పటి నుండి దేవుడు మమ్మును ఆశీర్వదించి కరువు నుండి ఆశీర్వాదమునకు నడిపించాడు. ఇంకా నా జీవితంలో అనేకమైన ఆశ్చర్యకార్యాలను దేవుడు చేస్తూ, నడిపిస్తూ వచ్చాడు. దేవునికి మహిమకలుగునుగాక. దేవుడు ఈ సాక్ష్యం దీవించునుగాకా!

# నిస్సీ

## 2016 ఉపవాస పండుగలలో

నూతనముగా విడుదల చేయబడిన 7వ పాటల సీడి, డివీడి

NEW ALBUMS

# "స్తోత్రార్పణ"

మరియు ఇశ్రాయేలు దేశంలో విడుదల చేసిన 6 వ పాటల సీడి, డివీడి

# "ఇశ్రాయేలు దేవా"

*సిద్ధముగా ఉన్నాయి. కావలసినవారు సంప్రదించండి:* PH.08734-240147

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా NEW
7. స్తోత్రార్పణ NEW

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ
7. నిన్ను నడిపించును
8. సౌందర్యము
9. ఐక్యత
10. ఆలోచన
11. సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. నీకురాజుఎవరు ?

## ప్రసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2. పరిశుద్ధత గుర్చి దర్శనము
3. రమ్యమైన గుడారము
4. దహించు అగ్ని
5. ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్థన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉద్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయబీజము అక్షయ బీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21. జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం. మా అడ్రస్ ...

**Nissi Ministries, H.No. 1-3-132/A6**
**ShastriNagar, Nirmal, Adilabad. 504106**
**Phone:08734-240147, 9390011485**

*మీ ప్రార్థనా అవసరతలకొరకు సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు-* **08734-240147**

ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు.

M.Jayaraj SBI- Branch: Nirmal A/c No: 31665876753

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485

Website: www. nissi ministries.org

Email ID: nissi.ministries@yahoo.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106

Edited Printed & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106